# ఉపవాసాల విడ్డూరాలు

శ్రీ పణతుల రామచంద్రయ్య

నిద్రలేస్తూనే ఒక్కసారి వళ్ళువిరుచుకుని రెండుసార్లు ఆవులించి చిటికలు వేసుకుని గడియారంవైపు చూశాను. ఇవాళ ఎనిమిదికే లేచానే అని బోలెడు ఆశ్చర్య పడిపోయాను.

గోడమీద దినాలక్యాలెండరు శనివారం చూపుతోంది. నాగుండె ఠార్ మంది. ఈ రోజు సుమారైన కరక్కాయే అనుకున్నాను. అన్నయ్య పరుపు ఖాళీగావుంది. వీడు కూడా నాకంటె ముందు లేచాడు గామాల్ను! అందుకేనా ఆకాశమంతా దట్టంగా మబ్బులు కమ్మేశాయి!

స్కూలుఫైనలు తెలుగులో చదివిన ఒక సంగతి చటుక్కున బుర్రలో మెరిసింది. చంద్రహాసోపాఖ్యానంలో కాబోలు ఎవరో ఒకమహర్షి చంద్రహాసుడికి జోస్యం చెబుతూ, ఎవరికైనా ఏరోజైనా దినచర్యలో అకారణంగా విపరీతమయిన మార్పువస్తే ఆరోజు ఏదో ఒక పాటి చిన్న అనర్థం ఏర్పడుతుందట. ఇది జ్ఞాపకం వచ్చేసరికి నాగుండె మరింత వేగంగా ఠార్ ఠార్ మంది.

ఈ రోజు శనివారం — ఇంటిల్లపాదీ ఉపవాసాలు కాబోలు— వేంకటేశ్వర స్వామికి; ఇక ఈ రోజు మా అన్నా దమ్ములిద్దరికి తలతిరిగి ముద్ద నోట్లోకి వస్తుంది— తప్పదు.

ఈ విధమయిన ఆలోచనల్తో నేనుఅవస్థ పడుతుంటే దొడ్లోనుంచి హఠాత్తుగా కేకలు వినిపించాయి.... ఇంకేం! అన్నయ్యే. నిక్షేపరాయుడు- దొడ్లో తతంగాల్లో జోక్యం చేసుకుని ఏదో ఘనకార్యం వెలిగించి వుంటాడు—

దొడ్లో వాదిన ఎవరినో అన్యాపదేశంగా కేకలేస్తూ వాళ్ళాయనిగా వినుక్కుంటూంది. అన్నయ్య ఆ కేకలకు- అటు క్షమాపణగా కాకుండా - ఇటు అధికారయుక్తంగా కాకుండా మధ్యరకంగా జవాబు చెబుతున్నాడు. పైగా అమ్మా, అత్తయ్యా, అక్కయ్యలూ కూడా - వీడి బ్రహ్మచారి చేష్టకు - వీడు బ్రహ్మచారి కావనుకోండి; అయినా బ్రహ్మచారీ శతమర్కటః అన్నరకం - ఒకపాటి నిరసన వెల్లడిచేస్తున్నారు. ఇదంతా వినేసరికి - వీడు ఇంతమందీ చేసే నిరసనలకు ఎలా తమాయించుకుని సంజాయిషీ చెపుతున్నాడా అని విస్తుపోయాను. అన్నయ్యశక్తి కార్యరంగంలో దూకేపరకే, ఆతరవాత పనికిరాదు.

నేనిలా తర్కించుకుని మథన పడుతూంటే ఆదరాబాదరా అన్నయ్య గదిలోకొచ్చాడు. వస్తూనే - "ఒరే అబ్బాయి! నీ శ్రేయోభిలాషిని కాబట్టి చెబుతున్నా-" అంటూ రఃజీఛైర్‌లో వాలాడు.

"ఇంతకీఏమిట్రా?" అన్నాను.

"అంటే - ఏమిటంటే- నువ్వుగాని మంగళహారతుల నుంచి తప్పించుకోవాలీ అంటే - లాంఛన ప్రాయంగా వళ్ళుతోమి బయటపడు" అన్నాడు.

కళ్ళు నులుముకుని లేచాను.

అన్నయ్య చెప్పింది - ఇంచు మించు అక్షరాలా అమలుచేసి - ఇవతలకొస్తుంటే, దొడ్లో బావిగోడ దగ్గర సూర్యనమస్కారాలు చేస్తున్న బామ్మ కేకేసింది - "కాఫీ వంటింట్లో మూసి పెట్టిఉంది. మరే హోటలుకూ వెంచెయ్యక అది పోసుకుతాగండి"

"హరి భగవంతుడా!" అనుకుంటూ వంటింట్లోకి దారితీశాను.

అత్తయ్య అమృతహస్తంనుండి జాలువారిన ఆ చపరాసీ కాఫీని రెండు గ్లాసుల్లోనూ నింపి అన్నయ్యను కేకేశాను. వసారా చూరుకంటి వేళాడుతున్న బూజుకాస్తా రాయితం మీద కెక్కించుకుని ప్రవేశించాడు వాడు.

"ఏమిట్రా?" అన్నాను, ఎందుకో అర్థంకాక.

"హు-వూరుకోరా, లేకపోతే ఈ కాఫీ తాగడానికి అయినా నోళ్ళుకూడా చాలవ్" అంటూనే గ్లాసుల్లో నింపబడ్డ కాఫీని గిన్నెలో కుమ్మరించి ఆ బూజును కాస్తా దాంట్లో పడేశాడు.

"ఒరేయి! అత్తయ్య చూసిందంటే ఇల్లుపీకి పందిరేస్తుంది" అన్నాను.

"పాలిష్. త్వరగాపద. అంతగా అడగొచ్చారంటే. 'ఎలా త్రాగం టూజాపర్డ కాఫీ" అని దబాయించొచ్చు' అన్నాడు. గుట్టు చప్పుడు కాకుండా పోయి హోటల్లో పడ్డాము.

హోటల్నుంచి తిన్నగా యింటికి చేరేసరికి వొదిన తులసమ్మకు ప్రదక్షిణాలు చేస్తోంది. మమ్మల్ని గమనించి నట్టులేదు. మెల్లగా గదిలోకి పోయి మ్యాగజైన్లు ముందు వేసుక్కూర్చున్నాము. దొడ్లో వొదినప్రదక్షిణాలు వినబడు తున్నాయి.

"మొదటి ప్రదక్షిణం ముదితనే జేతు
నిండార సంపదలు మా కియ్యావమ్మ"

"ఓహ్ ! మొదటి ప్రదక్షిణం చేసిందోలేదో ఈ పిడకి ఐశ్వర్యాలు" అంటూ వ్యాఖ్యానించాడు అన్నయ్య.

"స్. తిన్నగా మాట్లాడరాబాబూ" అన్నాను.

"రెండో ప్రదక్షిణం రెమ్మనే జేతు
సంతాన లాభమ్ము మాకియ్యావమ్మ"

"ఆ అడగటానికయినా అంతూ పంతూ వుండక్క్లేదు టే!- ఇంత విపరీతంగా అడుగుతావుకాబట్టే ఆవిడ మొదటికే నామం పెడుతుంది"- ఈసారిగట్టిగానే అన్నాడన్నయ్య.

వొదిన కూడా గట్టిగానే విసుక్కుంది.

వీళ్ల భక్తిని ఊతగా చేసుకుని వెంకటేశ్వర స్వామి ప్రతిశనివారం మాయింట్లో ఉపవాస పర్వదినాలు జరిపిస్తుంటారు. ఈ ఉపవాసంరోజున అందులో 'పాల్గొనే వాళ్లంతా భోంచెయ్యరు. ఇక పోతే ఆ అన్నంకోసం వాచి పోయేది నేనూ, అన్నయ్యా. అందువల్ల వీళ్లు ఆ రోజు ఉదయాన్నే మాకోసం విధి లేక ఓగిన్నె అత్తెసరు వార్చి ఓమూల పడేస్తారు. ఆ తర్వాత ఉపవాసం హడా విడిలో వుంటారు కాబట్టి[ఉపవాసం ఉంటూ హడావుడేమిటీ అంటారా— అయ్యో. ఫలహారాలు చేసుకోడానికి తయారు కావద్దటండీ! ]ఆ మూల పడేసిన అన్నం గిన్నె లోనికి ఏనుగులు దూరినా వీళ్లు పట్టించు కోరు. ఆ అన్నంతో పాటు ఇన్నితొట్లోటి మంచినీళ్లు, రెండు రోజులనాటి గోంగూర పచ్చడీ, ఇన్ని 'స్టెరి లైజ్‌డ్' మజ్జిగ నీళ్లు ఆమూల పడేసి వుంచుతారు—

అదే మిటండీ. ఉపవాస ముంటున్నారు కదా. ఆ శోషలో మీకు సర్వమూ ఎలా అమర్చి పెడతారూ ? అని మీరంటే, అది మీ భ్రాంతే నంటాను. ఇంట్లో అయితే అన్నయ్యో, నేనో మైలతో ముట్టుకునేస్తా మని, ఎదురింటి పిన్ని గారితో చెప్పిపెడతారు. అయినా-పేలపిండి అపక్వాహారం కాబట్టి దోషం లేదంటాను నేను.

పోనీ. వీళ్లతో బేరం మనకు సరి పడదులే. కాస్త ఏహోటల్లో కయినా పోయి నాలుగు మెతుకులు తిని వద్దామా అంటే. అదీపడనీయరు. "వృధాగా హోటలు వాడు బాగు పడిపోతున్నాడు." అని గునుస్తారు. ఎలాగో మాకింత వండి పడేసి సాయంత్రం ఫలహారాల తయారీ ప్రారంభిస్తారు.

ఇక ఫలహారాల సంగతి—వివరాలకు పోకుండా సంగ్రహంగా ముచ్చటించి వదిలేస్తాను. ఉదయాన్నుంచీ పచ్చి మంచినీళ్లు లేకుండా వున్నారా, [వాళ్ల దృష్టిలో,] ఇక ఏరాత్రికో ఆ వుప్పుపిండి చేసుకుని ఎవరిపాటికి వాళ్లు బిక్కు బిక్కుమంటూ తినాలంటే ఎలా సహిస్తుంది చెప్పండి ? అందుకని అందరూ ఏకం అవుతారు. ఎదురింటి పిన్నిగారు. పక్కవాటాలో దుర్గమ్మబామ్మగారు. ఆచంటవారి నాయనమ్మగారూ—వాళ్ల వాళ్ల సామగ్రి అంతా తెచ్చి వొకటిగామాయింట్లో వుడికిస్తారు. పరస్పర సహకారసూత్రం దేశంలో వ్యాప్తి కావటం లేదని గవర్నమెంటు వారు అంటుంటారుకాని. ఒక్కసారి శనివారం రోజు మాయింటికి వచ్చి పరికిస్తే వాళ్ల వాదన నిజంకాదని ఇట్టే తేలి పోతుంది.

పోతే ఈ ఉప్పుపిండిలోకి ఏపచ్చడో....అయ్యో, పచ్చడేంఖర్మ ! — ఉదయంనుంచి ఆవురావురు మని ! సలక్షణంగా పచ్చడీ, మజ్జిగపులుసూ, దోసావకాయా వగైరా వగైరా....

సాయంత్రం ఏ ఆరుకో మేం క్లబ్బునుంచి ఇంటి కొచ్చేసరికి "బారులు దీర్చి భూపతులు" అన్నట్టుగా అల్పాహారం సాగుతూ వుంటుంది. వచ్చిన వాళ్లం రెండు నిముషాల్లో తిరుగుముఖం పెట్టేమా సరి, లేకుంటే "ఈ మగ కీటకాలు ఇక్కడెందుకున్నట్లు ? —దిష్టి పెడుతూనూ" అన్నట్టు చూస్తారు.

ఏంచేస్తాం ? ఈ ఉపవాస పర్వదినాల్లో మగ పురుగులు "సత్రేభోజే, మఠేనిద్రే" అన్నట్టు గడప వలసిందే,